తీగల వంతెనతో స్మార్ట్‌సిటీకి సంబంధం లేదు

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, జూలై 29: కరీంనగరంలోని తీగల వంతెన ప్రాజెక్టుకు కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, నగరపాలక సంస్థకు ఎలాంటి సంబంధం లేదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం మేయర్ ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలోని మానేరు వాగుపై గంతంలో రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో తీగల వంతెన నిర్మించారని పేర్కొన్నారు. ప్రస్తుతం దాని పూర్తి నిర్వహణ బాధ్యతలు ఆర్ అండ్ బీ శాఖ అధికారులే చూస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా నగర వ్యాప్తంగా 14.5 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన రహదారులు, పలు చోట్ల డ్రైనేజీల కల్వర్టులు కూడా రోడ్డు భవనాల శాఖకు చెందినవేనని, వీటి పూర్తి నిర్వహణ బాధ్యతలు కూడా ఆ శాఖనే చూస్తున్నదని పేర్కొన్నారు. ఇటీవల దీనిపై వస్తున్న కథనాలన్నీ కూడా అవాస్తవమని పేర్కొన్నారు. నగరంలోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీలతో మాత్రమే నగరపాలక సంస్థకు సంబంధం ఉందని, వానకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగొద్దని ఇప్పటికే 60 డివిజన్ల పరిధిలో వాటిని పరిశీలించామని తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, శిథిలమైన డ్రైనేజీలను మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రస్తుతం సీఎం అస్యూరెన్స్ నిధులతో చేపట్టిన పనులు పలు కారణాలతో నిలిచిన చోట మాత్రమే వర్షాల వల్ల అక్కడక్కడ నీరు నిలిచి కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. ఆర్ అండ్ బీకి చెందిన పలు రహదారులు, డ్రైనేజీ శిథిలావస్థకు చేరడంతో పలు ప్రాంతాల్లో ఇబ్బంది వస్తున్నదని, అలాంటి ప్రదేశాలపై ఆ శాఖ దృష్టి పెట్టి పనులు చేయాలని అనేక మార్లు నగరపాలక సంస్థ నుంచి లేఖలు రాశామని తెలిపారు.

వనమహోత్సవ టెండర్లు బహిష్కరణ

- బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ల నిర్ణయం

కార్పొరేషన్, జూలై 29: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులు, వనమహోత్సవ టెండర్లను బహిష్కరిస్తున్నామని కరీంనగర్ నగరపాలక సంస్థ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కన్వీనర్ దగ్గు మహేందర్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో పెద్ద మొత్తంలో చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఆరు నెలలుగా ప్రభుత్వం, నగరపాలక సంస్థ నుంచి ఒక్క బిల్లు కూడా రాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. నెలల తరబడి తాము ఓపికగా ఎదురుచూడడంతో పాటు వివిధ అభివృద్ధి పనులు కూడా చేపట్టామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం, నగరపాలక సంస్థ నుంచి సరైన స్పందన రాకపోవడం వల్లే ఈ సారి టెండర్లను బహిష్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన వనమహోత్సవ టెండర్లలో నగరపాలక కాంట్రాక్టర్లు ఎవరూ కూడా పాల్గొనడం లేదన్నారు. ఆగస్టు 15లోగా తమకు రావాల్సిన బిల్లులను చెల్లించాలని కోరారు. అప్పటికి కూడా ప్రభుత్వం స్పందించి, బిల్లులు ఇవ్వకపోతే పనులను కూడా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్ బోర్డు కాలనీ, జూలై 29: స్వాతంత్ర్య దినోత్సవం రాఖీ పౌర్ణమి, వినాయక చవితి పండుగల సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్ పల్లి ఖాదీ భవన్‌లో ఆగస్టు 1నుంచి సెప్టెంబర్ 10 వరకు వరకు ఖాదీ వస్త్రాలు 40 శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

గౌతమి నంది పురస్కారం స్వీకరించిన వైరాగ్యం

కమాన్‌చౌరస్తా, జూలై 29 : సాహితీ రంగంలో తనదైన స్థానాన్ని నిలుపుకొన్న జిల్లాకు చెందిన వైరాగ్యం ప్రభాకర్ ఉత్తమ సాహితీ గురు బిరుదుతో పాటు గౌతమి బంగారు నంది జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్వీఆర్ ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి సంయుక్తంగా అవార్డులు ప్రదానం చేశారు.

మరిచిపోయిన బ్యాగ్ అప్పగించిన సెక్యూరిటీ సిబ్బంది

తెలంగాణచౌక్, జూలై 29: మంచిర్యాల నుంచి గర్భకుర్తికి వెళ్తున్న వర్షిణి అనే ప్రయాణికురాలు కరీంనగర్ బస్టాండ్‌లో బస్సులో బ్యాగ్ మరిచిపోగా, బస్టాండ్‌లో బస్సులను తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ గార్డు కవిత దానిని గమనించి స్టేషన్ మేనేజర్ అంజయ్యకు అప్పగించింది. అందులో ఉన్న ఆధారాలతో ప్రయాణికురాలికి సమాచారం అందించి బ్యాగును అప్పగించారు. బ్యాగ్‌లో విలువైన రెండు సెల్ ఫోన్స్, వర్జినల్ సర్టిఫికెట్స్ ఉన్నాయని, వాటిని భద్రంగా అప్పగించిన సెక్యూరిటీ సిబ్బంది, స్టేషన్ మేనేజర్ అంజయ్యకు వర్షిణి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గంగాధర: గర్భకుర్తిలో రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సునీత

కరీంనగర్ రూరల్: చామనపల్లిలో దీక్ష చేస్తున్న పవర్‌లూమ్ కార్మికులు

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- చేనేత ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిందం సునీత డిమాండ్
- గర్భకుర్తిలో మరమగ్గాల కార్మికుల రిలే నిరాహార దీక్షకు సంఘీభావం

గంగాధర, జూలై 29: ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిందం సునీత డిమాండ్ చేశారు. మండలంలోని గర్భకుర్తిలో ఐదు రోజులుగా మరమగ్గాల కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో బతుకమ్మ చీరల తయారీతో కార్మికులు ఉపాధి పొందగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దానిని దూరం చేసిందన్నారు. వెంటనే గర్భకుర్తి చేనేత కార్మికులకు వస్త్రోత్పత్తికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే కార్మికుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మరమగ్గాల కార్మికులు పాల్గొన్నారు.

చామనపల్లిలో కార్మికుల దీక్ష

కరీంనగర్ రూరల్, జూలై 29: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో సీఐటీయూ గ్రామాధ్యక్షుడు దూడం గంగాధర్ ఆధ్వర్యంలో 16 రోజులుగా సమ్మె చేస్తున్న పవర్‌లూమ్ కార్మికులు సోమవారం గ్రామంలోని పద్మశాలీ భవనంలో దీక్ష చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రదాన కార్యదర్శి యూ శ్రీనివాస్ మాట్లాడుతూ, యజమానులు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం కమిటీ సభ్యులు స్వామి, మల్లేశం, అనిల్, రాజయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లప్పుడూ అందుబాటులో షీటీం సేవలు

రాంనగర్, జూలై 29: మహిళలు, యువతులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని షీటీం ఇన్‌చార్జి శ్రీలత సూచించారు. సోమవారం స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మహిళలు, విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. విపత్కర పరిస్థితుల్లో భయాందోళనకు గురికాకుండా డయల్ 100, ఉమెన్ సేఫ్టీ వింగ్ రూపొందించిన టీసేఫ్ అప్లికేషన్ ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీటీం సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని, మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.

బిల్లులు చెల్లించాకే జీపీ ఎన్నికలు నిర్వహించాలి

గంగాధర, జూలై 29: పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించిన తర్వాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శ్రీమల్ల మేఘరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో సర్పంచులుగా అప్పులు తెచ్చి గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. సకాలంలో బిల్లులు రాక అప్పులపాలైనట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో ఆగస్టు 2న సెక్రటేరియట్ ఎదుట నిర్వహించనున్న శాంతియుత నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, జూలై 29: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఆగస్టు 6, 7 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. అల్గునూర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం 'చలో ఢిల్లీ'కి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాకు ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మురళి, తిరుపతి, రాకేశ్, సంపత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి

జాప శ్రీనివాస్ రెడ్డి (ఫైల్)

కమాన్‌చౌరస్తా, జూలై 29 : నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్) బీఆర్ఎస్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్ రెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నగర మేయర్ వై సునీల్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ సంతాపం తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

మానకొండూర్ రూరల్, జూలై 29: మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన గాడిచెర్ల తిరుపతి అనే వ్యక్తిపై ఈ నెల 19న భూతగాద విషయంలో కత్తితో దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. తిరుపతి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గాడిచెర్ల సాయికుమార్‌తో పాటు అతడి తండ్రి రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మానకొండూర్ సీఐ సదన్ కుమార్ తెలిపారు.

బీసీ యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా రజనీకాంత్

చిగురుమామిడి, జూలై 29: బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా రేకొండ గ్రామానికి చెందిన పిట్టల రజనీకాంత్‌ను నియమించినట్లు జిల్లా యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా మారిన చెట్ల తొలగింపు

చొప్పదండి, జూలై 29: చొప్పదండి పట్టణం 4వ వార్డు పరిధిలోని భూపాలపట్నం వెళ్లే దారిలో ఎండిపోయి ప్రమాదకరంగా మారిన చెట్లను వార్డు కౌన్సిలర్ చేపూరి హేమాసత్యనారాయణ సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ, ఎండిపోయిన చెట్టు దారి వెంట వెళ్లే వాహనదారులు, స్థానికుల మీద పడే ప్రమాదం ఉండడంతో తొలగించామని తెలిపారు. దీనికి సహకరించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్, సిబ్బందికి పట్టణ, వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ధరణి సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణచౌక్, జూలై 29: ధరణి పోర్టల్‌తో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్ భవనంలో ఫ్రంట్ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే రైతులు తిరుగబడే అవకాశం ఉంటుందన్నారు.

సామాజిక వేత్తకు సత్కారం

హుజూరాబాద్ రూరల్, జూలై 29: సిర్సపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్‌ను ఇటీవల పట్టణంలో పాపారావు బొంద ప్రాంతం వద్ద అగ్నిప్రమాదానికి గురైన పండ్ల దుకాణాల యజమానులు సోమవారం శాలువాలతో సత్కరించారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన చిరు వ్యాపారులకు వెంకట్ ఆర్థిక సాయం అందించడంతో అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు సంగెం సత్యనారాయణ, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

గంగిపల్లిలో షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ

మానకొండూర్ రూరల్, జూలై 29: గంగిపల్లి గ్రామంలో 'ఆడపిల్ల అంటే బతుకు' షార్ట్ ఫిల్మ్‌ను డైరెక్టర్ రుద్రోజు వాయు కుమార్ చిత్రీకరిస్తున్నారు. సోమవారం చిత్రీకరణను సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ రంగు భాస్కరాచారి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నటీనటులు వినీత, స్రవంతి, మమత, లత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ఆపరేటర్ల తొలగింపు అన్యాయం

కలెక్టరేట్, జూలై 29: అదనపు వేతనం అడిగితే ఆధార్ ఆపరేటర్లను అన్యాయంగా తొలగిస్తున్నారని ఆధార్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెల్లోజి రఘుపతి ఆరోపించారు. సోమవారం నగరంలోని లక్ష్మీనగర్‌లో గల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఆధార్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు ఎస్బీఐ బ్యాంకుల్లో బ్లూత్రీ ఐటీ సొల్యూషన్స్ అనే సంస్థ ద్వారా ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లతో ఆ సంస్థ వెట్టిచాకిరీ చేయిస్తున్నదని ఆరోపించారు. ఇబ్బందులపై ప్రశ్నిస్తే ఆపరేటర్లను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగిస్తున్నదని, దీనిపై ఆ సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆధార్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆధార్ ఆపరేటర్లు శ్యాంకుమార్, సతీశ్, వెంకటేశ్, ఈర్ల వినీత్, మహ్మద్ ఇర్ఫాన్, యాకూబ్ అలీతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఆపరేటర్లు పాల్గొన్నారు.

ముత్యాల పోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



పద్మనగర్ పోచమ్మ ఆలయంలో కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జులు పురమల్ల, వెలిచాలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు తదితరులు

రాంనగర్/ విద్యానగర్, జూలై 29: పద్మనగర్‌లోని ముత్యాల పోచమ్మ ఆలయాన్ని ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జులు పురమల్ల శ్రీనివాస్, వెలిచాల రాజేందర్ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరీంనగర్ ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు, పురుమల్ల శ్రీనివాస్‌ను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మడుపు మోహన్, బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ బోనాల మురళి, ఆలయ కమిటీ సభ్యులు మోర రాజేశం, మచ్చ హరిదాస్, బైరి సత్యానంద్, వెల్లండి మురళి, సొల్లేటి సుభాష్, జిట్టవేణి పరశురాములు, బైరి సంపత్, తోట శ్రీనివాస్, శ్రీపతి కిశోర్, ఆలయ పూజారి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాల కార్మికుల గుర్తింపు

కలెక్టరేట్, జూలై 29 : నగరంలోని చైతన్యపురిలో గల ఓ వెల్డింగ్ దుకాణంలో పని చేస్తున్న ఇద్దరు బాలకార్మికులను చైల్డ్ లైన్ సిబ్బంది గుర్తించి, వారిని జ్యోతిన గర్‌లోని ఓపెన్ షెల్టర్ హోంకు తరలించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీపీఎస్, చైల్డ్‌లైన్ 1098 సిబ్బంది సంయుక్తంగా నగరంలో వస్త్ర, కిరాణా, హోటళ్లు, మెకానిక్ షెడ్లు, వెల్డింగ్ షాపులు, తదితర దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో సోమవారం కూడా పలు దుకాణాలు పరిశీలించగా, వెల్డింగ్ షాపులో పనిచేస్తున్న ఇద్దరు బాలలను గుర్తించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. వారిని అధికారుల ఎదుట ప్రవేశపెట్టి, సంబంధిత దుకాణాయజమానిపై చర్యలు తీసుకునేలా సిఫారసు చేయనున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మయ్య

లక్ష్మయ్య

కోర్టుచౌరస్తా, జూలై 29: కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మొగిలిపాలెం మాజీ సర్పంచ్, సీనియర్ న్యాయవాది కల్లేపల్లి లక్ష్మయ్యను నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్లుగా వడ్లూరి కృష్ణ, ప్రదీప్ కుమార్ రాజు, కన్వీనర్లుగా కొత్తకొండ శంకర్, లింగంపల్లి శ్రీకాంత్, ఎండీ నవాజ్, జాయింట్ కన్వీనర్లుగా తుమ్మ ప్రభాకర్, రాయికంటి కుమార్, ఇట్టు సృజన్, బొడ్డు రాజు, ముఖ్య సలహాదారులుగా సింగిరెడ్డి లక్ష్మీరెడ్డి, లుక్కా రాజేశం, ఎస్ కిషన్‌ను నియమించారు.

బడ్జెట్‌లో మహిళా అభివృద్ధికి నిధులేవి?

తెలంగాణచౌక్, జూలై 29: బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృద్ధి కోసం నిధులు కేటాయించలేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ నాయకురాలు జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆరోపించారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్న ఐద్వా రాజకీయ శిక్షణ తరగతుల చివరి రోజు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మహిళల అభివృద్ధి కోసం ఉద్యోగ కల్పన, కుటీర పరిశ్రమలకు నిధులు కేటాయించకపోవడం వారిని విస్మరించడమేన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రతి మహిళకు రూ.2500, కల్యాణలక్ష్మిలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం, రూ.500కు గ్యాస్ సిలిండర్, పేదలకు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు ఆశాలత, జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

తెలంగాణచౌక్, జూలై 29: ఎన్నికల ముందు ఉద్యమకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఉద్యమకారుల గురించి ప్రస్తావించడం లేదని తెలంగాణ ఉద్యమకారులు ఫోరం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. హామీలపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ సోమవారం నగరంలోని మార్కెట్ రోడ్‌లో గల తెలంగాణ అమర వీరుల స్తూపానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో తెలంగాణ ఉద్యమకారుల గురించి చర్చించి, వారిని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, వినోద్‌కుమార్, వెంకన్న, శారద, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న స్నేహబంధం

రాజు కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందిస్తున్న స్నేహితులు

చొప్పదండి, జూలై29 : పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన బుర్ర రాజు అనే వ్యక్తి 20 రోజుల క్రితం బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం బాధిత కుటుంబాన్ని రాజుతో కలిసి స్థానిక ప్రతిభ విద్యానికేతన్‌లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు పరామర్శించారు. తోటి పూర్వ విద్యార్థులంతా కలిసి రూ. లక్షా 4వేలు, జూనియర్స్, ఉపాధ్యాయులు, ఇతర స్నేహితులు కలిసి రూ.28,300 మొత్తం రూ. 1,32,300 నగదును జమచేసి, రాజు ఇద్దరు కుమార్తెల పేరుమీద రూ.66 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రాజు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వరదతో నీట మునిగిన పంట పొలాలు

గంగాధర, జూలై 29: వరదకాలువ నుంచి ఉపకాలువకు విడుదల చేసిన నీటితో పంట పొలాలు మునిగిపోయాయని రైతులు ఆరోపించారు. మండలంలోని ఆచంపల్లి వద్ద వరదకాలువకు ఏర్పాటు చేసిన తూము నుంచి కొత్తపల్లి మండలం నాగులమల్యాల చెరువుకు కాలువ ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. కాగా, కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో ఆచంపల్లి, విలాసాగర్ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన కల్వర్టు వద్ద నీరు పొలాల్లోకి చేరింది. దీంతో వరినార్లు నీట మునిగాయని రైతులు తెలిపారు. అలాగే దారిపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది ఉందని తెలిపారు. అధికారులు స్పందించి కాలువలో ఉన్న చెత్తను తొలగింపజేసి, సక్రమంగా నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు.

ఆచంపల్లి కల్వర్టు వద్ద కాలువలో చెత్త పేరుకుపోవడంతో పొలాల్లోకి చేరిన వరద

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★ Nagarapu Devender, S/o. Chinna Mallaiah, my spouse Name is Nagarapu Bagya Laxmi, H.No. 4-5-1/1, Gambhiraopet, Rajanna Sircilla Dist, my spouse Name is changed as Nagarapu Bhagya. NTK-325513

CHANGE OF NAME

★ I NALUMAS SHRIMATHI (Old Name) R/O. 6-44,MEDIPALLI, JAGITYAL. Hence changed my name as KOTAGIRI NISHITHA W/O. KOTAGIRI NAGESH (New Name) NTK-326207

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన నమస్తే తెలంగాణ
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైనుకు 50/- మాత్రమే
3+1 ఫ్రీ ఆఫర్
ప్రకటనల కొరకు...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కిట్స్ ఉద్యోగులకు పీఎఫ్‌పై అవగాహన

హుజూరాబాద్ రూరల్, జూలై 29: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ శాఖ ఆధ్వర్యంలో ఎంప్లాయీస్ పీఎఫ్ ఆర్గనైజేషన్ కరీంనగర్ జిల్లా ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కిట్స్ కళాశాలలో ఉద్యోగులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎన్ వెంకటేశ్వర్లు హాజరై, ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ ప్రాముఖ్యతను వివరించారు.